క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందిస్తున్న కీర్తిపట్నాయక్

సింహాచలం: నగరానికి చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సింహగిరిపై నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆ సంస్థ ఫౌండర్ కుప్పిలి కీర్తిపట్నాయక్ స్వయంగా ఈ చీరలు అందించారు. ఏటా తమ సంస్థ తరఫున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట సంస్థ వలంటీర్ సీత ఉన్నారు.

చెట్లు తాకి.. తరచూ విద్యుత్ అంతరాయం



విద్యుత్ తీగలను తాకిన సరుగుడు చెట్లు

పరవాడ: వాడచీపురుపల్లి–తిక్కవానిపాలెం రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల వైర్లను చెట్లు తాకుతుండటంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిక్కవానిపాలెం రహదారి మీదుగా ఏర్పాటు చేసిన హెచ్‌టీ విద్యుత్ లైన్‌లో స్తంభాలకు అమర్చిన విద్యుత్ తీగలకు ఊటగెడ్డపాలెం సమీపంలో రైతులు నాటిన సరుగుడు చెట్లు తాకుతున్నాయి. వర్షాలు, ఈదురు గాలులు వీస్తున్న సమయంలో సరుగుడు చెట్లు విద్యుత్ తీగలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నట్లు ప్రజలు చెప్పన్నారు. సమస్యను విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించట్లేదని వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కళాశాల అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

సబ్బవరం: జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం జీసీజీటీఏ అనకాపల్లి జిల్లా స్థాయి నూతన కార్యవర్గం ఎన్నిక సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగింది. భీమవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు బి.ప్రసాదరావు పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించి, అనంతరం పాలకవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. నూతన పాలకవర్గ అధ్యక్షుడిగా ఎంవీ రామకృష్ణ, కార్యదర్శిగా డాక్టర్ బీవీ రమణ, కోశాధికారిగా డాక్టర్ ఎస్ సూర్యావతి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ పి.పైడిరాజు, రాష్ట్ర కౌన్సిలర్‌గా డాక్టర్ టి.రాధాకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జీసీజీటీఏ జిల్లా అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

మేహాద్రి చేప.. మహా గిరాకీ



చేపల దుకాణం వద్ద కొనుగోలుదారులు

పెందుర్తి: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో మత్స్య సంపదకు కొదవ లేదు. కొర్రమీను, బొమ్మిడాయి, శీలావతి, బొచ్చు, పాల గొరస, మట్టగిడస.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ జాబితా చాంతాడంత. ఇక్కడి స్థానికంగానే కాకుండా నగరం నుంచి కూడా మంచి గిరాకీ ఉంది. మేహాద్రికి అతి సమీపంలో ఉన్న చింతలగ్రహారం వంతెన వద్ద ప్రతి రోజూ మేహాద్రి నుంచి పట్టి తెచ్చిన చేపలను విక్రయిస్తుంటారు. ముఖ్యంగా ఆది, మంగళ, బుధ, గురువారాల్లో మేహాద్రి చేపల కోసం జనం ఎగబడుతుంటారు. ఆదివారం కావడంతో ఇక్కడ చేపల విక్రయాల సందడి కనిపించింది.

వరి సాగులో.. యంత్రాల బాట

సబ్బవరం మండలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరుగుతోంది. రైతులు సంప్రదాయ సాగు పద్ధతులకు స్వస్తి పలికి, యాంత్రీకరణ దిశగా వడివడిగా అడుగులేస్తున్నారు. సమయం, ఖర్చు ఆదాతోపాటు, కూలీల కొరత సమస్యకు యాంత్రీకరణ చక్కని పరిష్కారంగా చెప్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్ల(సీహెచ్‌సీ)తో ఈ యాంత్రీకరణ మరింత జోరందుకుంది.

- వరి కోతలు, నూర్పుల్లో సంప్రదాయ పద్ధతులకు స్వస్తి
- సమయం, ఖర్చు ఆదా.. కూలీల కొరతకు పరిష్కారం
- సబ్బవరం మండలంలో వరి సాగు రైతులు 2,200 మంది
- ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు 3,800 ఎకరాలు



వంగలిలో యంత్రంతో వరి నూర్పుతున్న రైతులు



అమృతపురంలో మిషన్ సహాయంతో కోతలు కోస్తున్న రైతులు

సబ్బవరం: మండలంలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారం. ఏ మాత్రం అదను తప్పినా.. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకూ తిప్పలు పడాల్సిందే. అందుకే సమయాభావం లేకుండా యంత్రాల వినియోగంపై రైతులు దృష్టి సారిస్తున్నారు. వాతావరణం అనుకూలించి వర్షాలు కురిస్తే అందరికీ ఒకే సమయంలో నాట్లు వేసుకునే పరిస్థితి. మండలంలో చాలా మంది రైతులు చిన్న చిన్న కమతాల్లోనే వరి పండిస్తున్నారు. వీరు ఎవరి పొలాల్లో వారే పనులు చేసుకునే పరిస్థితి. ఓ మాదిరి విస్తీర్ణంలో సాగు చేసే రైతులకు కూలీల సమస్య ఎక్కువ. దీంతో వరి నాట్లు నుంచి కోతలు, నూర్పులు వరకు **యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సుమారు 3,800 ఎకరాల్లో వరి సాగు జరిగింది. 2,200 మంది వరకూ రైతులు వరి పంట వేశారు. ప్రస్తుతం కోతలు పూర్తయి..** జోరుగా నూర్పులు జరుగుతున్నాయి.



యంత్రంతో నూర్చిన ధాన్యాన్ని మూటలు కడుతున్న రైతులు

గత ప్రభుత్వం చొరవతో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయాన్ని అన్ని విధాలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే ప్రతి రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేశారు. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో 17 ఆర్బీకేలకుగాను 16 సీహెచ్‌సీలు ఏర్పాటయ్యాయి. గ్రామంలో 5 నుంచి 8 మంది రైతులు సభ్యులుగా ఒక సంఘం ఏర్పడి, దాని ఆధ్వర్యంలో ఈ సీహెచ్‌సీని ఏర్పాటు చేసుకునేవారు. ఈ సీహెచ్‌సీలోని యంత్రాలు, యంత్ర పరికరాలను సంఘం సభ్యులతో పాటు ఆయా రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులు అద్దె ప్రాతిపదికన వినియోగించుకునేవారు.

సీహెచ్‌సీలో యంత్రాలు

- ఒక్కో సీహెచ్‌సీకు రూ.15 లక్షల విలువ చేసే యంత్రాలు, యంత్ర పరికరాలను గత ప్రభుత్వం సమకూర్చింది.
- సీహెచ్‌సీ పరిధిలో ట్రాక్టర్, నాగలి సెట్, దమ్ము సెట్, రొటావీటర్, ఫ్లవ్ సెట్, నూర్పిడి యంత్రం, పవర్ వీడర్ వంటి యంత్రాలు, యంత్ర పరికరాలు, పని ముట్లు అందుబాటులో ఉంచారు.
- ఇందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ అందించగా, బ్యాంకు రుణాల ద్వారా 40 శాతం, రైతు వాటాగా కేవలం 10 శాతం మాత్రమే చెల్లించారు.

యంత్రాల వినియోగం పెరిగింది



సాగులో యంత్రాలను ఉపయోగించడం ద్వారా సమయం ఆదా అవుతుంది. దీంతో పాటు చిన్న కమతాలలో సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగకరం. ఇటీవల కాలంలో సాగులో రైతులు అధికంగా యంత్రాలను వినియోగిస్తున్నారు. నాట్లు నుంచి నూర్పిడి వరకూ యంత్రాలొచ్చేశాయి. దీంతో కూలీల కొరత సమస్య చాలా వరకు తగ్గింది.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి

గంటన్నరలో ఎకరా నూర్పు



మల్టీ క్రాఫ్ త్రషర్(నూర్పు యంత్రం) సహాయంతో ఎకరా విస్తీర్ణంల పండిన వరి చేను నూర్పు గంటన్నరలో పూర్తి చేయొచ్చు. రోజుకు 3–5 ఎకరాల వరకూ వరి నూర్పులు ఈ యంత్రం సాయంతో చేస్తున్నాం. దీన్ని రూ.2.90 లక్షలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొందరికి రాయితీపై కూడా ఈ మిషన్లను అందించింది.

– జెట్టి వాసు, వరి నూర్పిడి యంత్రం యజమాని, వంగలి గ్రామం

మూడింతల టైం ఆదా



నేను 1.2 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఇటీవలే వరి నూర్పిడి మిషన్‌తో నూర్పులు చేపట్టాం. గంటకు రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ కంటే నూర్పిడి మిషన్‌తో వరి నూర్పులు చేపట్టడంతో మూడింతల సమయం ఆదా అవుతుంది. తక్కువ మంది సాయంతో నూర్పులు చేపట్టి, ధాన్యం ఇంటికి తెచ్చుకోవచ్చు.

– సంబారు శ్రీనివాసరావు, రాయపుర అగ్రహారం

నేడు ముదపాకలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి: మండలంలోని ముదపాక పంచాయతీ సచివాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ముదపాక రెవెన్యూ పరిధిలో భూములున్న రైతులు రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురం చెల్లయ్యమ్మతోటలో కొలువైన భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలతోపాటు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మంగళస్నానాలు చేయించి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల రోజులకోసారి అమ్మవారికి నిర్వహించే ఈ మహోత్సవంలో ఒక్కో అధివాసం ఒక్కో పత్రితో పూజిస్తారు. ఈ అధివాసంలో జిల్లేడు పత్రితో పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఓం భువనేశ్వరీదేవి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవాల్లో భాగంగా వచ్చే అధివాసం ఏప్రిల్ 13న వేప పత్రితో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

8 నుంచి 'అడవివరం' సొసైటీ సభ్యులకు డివిడెండ్

- లోన్లు చెల్లించనివారిపై చర్యలు తప్పవు
- మహాజన సభలో అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి



మహాజన సభలో మాట్లాడుతున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు సంక్రాంతి కానుకగా ఈ నెల 8 నుంచి 20 వరకు డివిడెండ్‌లు పంపిణీ చేస్తామని సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. సొసైటీ మహాజన సభ ఆదివారం ఒక ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్ రూ.1.75 కోట్లపై 8 శాతం, షేర్ క్యాపిటల్ రూ.49 లక్షలపై 20 శాతం డివిడెండ్ రూపంలో అందిస్తామన్నారు. సొసైటీ రూ.152 కోట్ల టర్నోవర్‌తో నడుస్తోందన్నారు. రూ.92.92 కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్నట్లు తెలిపారు. సొసైటీ మూడు బ్రాంచిల్లో సుమారు ఆరున్నర కిలోల బంగారు వస్తువులు దీర్ఘకాలికంగా తనఖాలో ఉన్నాయని, వాటిని బహిరంగ వేలం ద్వారా ఆక్షన్ వేస్తామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 2017 మార్చి 31కి ముందు రుణాలు తీసుకుని చెల్లించని వారికి ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని మరో ఏడాదికి పొడిగిస్తున్నామన్నారు. ఏప్రిల్ నుంచి సొసైటీలో లావాదేవీలన్నింటినీ పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించి, అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు తమ సలహాలు, సూచనలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. చాలామంది సభ్యులకు మహాజన సభ నిర్వహణ విషయం తెలియపరచలేదని ఫిర్యాదు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గ్యాస్ గొడౌన్ నిర్వహణను ప్రస్తావించారు. సొసైటీ భవనంపై అదనపు అంతస్తు నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోవడంతో ఎప్పుడు పునఃప్రారంభిస్తారని అడిగారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు బోర ప్రసాద్‌రెడ్డి, కొలుసు గురునాథ్, కోరాడ ఈశ్వరరావు, మజ్జి ధర్మరాజు, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, లండ వెంకటరమణ, గునిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజోపయోగానికి అడుగు దూరంలో ఆపేశారు



చివరి దశలో నిలిచిపోయిన వెల్‌నెస్ సెంటర్



తుది పనులకు నోచుకోని రైతు భరోసా కేంద్రం

- 90 శాతం పూర్తయిన వెల్‌నెస్, ఆర్బీకే భవనాలు
- మిగిలిన నిధులకు కూటమి ప్రభుత్వం నిర్లిప్తత
- దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిన వైనం

పరవాడ: మండలంలోని కలపాక గ్రామంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను అందుబాటులోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తుది మెరుగులు మినహా, నిర్మాణాలు పూర్తయ్యాయి. అందుకు అవసరమైన నిధుల మంజూరులో కూటమి ప్రభుత్వ తీరును గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.17 లక్షలు, రైతులకు అన్ని రకాల సేవలు ఒకే చోట అందించే రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ.21 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధుల మేరకు కాంట్రాక్టర్ రెండు భవనాల నిర్మాణాలను చేపట్టారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. భవనాలకు తలుపులు, గచ్చులు, పెయింటింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి పూర్తి చేస్తే భవనాలను వినియోగంలోకి తీసుకురావొచ్చు. అయితే ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు. కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఈ భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరుపై కనీస ధ్యాస చూపట్లేదు. దీంతో తుది దశకు చేరుకున్న నిర్మాణాలు అక్కడితే ఆగిపోయాయి. ప్రజోపయోగ కార్యక్రమాలకు అవసరమైన ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పండగల వేళ జాగ్రత్త

పెందుర్తి క్రైం ఎస్ఐ సూరిబాబు



పెందుర్తి: సంక్రాంతి పండగ, సెలవుల సమయంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు సూచించారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరం అన్నారు. పెందుర్తి ప్రాంతంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు పూర్తి స్థాయిలో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రీపగలూ అనే తేడా లేకుండా దొంగతనాలు జరుగుతున్నందున విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలని ప్రజలకు సూచించారు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సంస్థలు, వ్యక్తిగత గృహాలకు కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒంటరిగా వెళ్లే మహిళలు తాము ధరించిన నగలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రజలు సెలవుల్లో ఊర్లకు వెళ్లేటపుడు ఆ వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారం కోసం 1090, 100, 94409 04717(క్రైం సీఐ), 83310 41618(క్రైం ఎస్), 0891–2764233(పీఎస్) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా సుదర్శన హోమం

- శ్రీవారికి ఘనంగా పుష్పయాగం
- భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజ
- వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన వేంకటాద్రి



శ్రీవారికి పుష్పయాగం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల



పాల్గొన్న భక్తు జన సందోహం

పెందుర్తి: గోవింద నామస్మరణతో పెందుర్తి పులకించింది. భక్తజనంతో వేంకటాద్రి పోటెత్తింది. పెందుర్తి వేంకటాద్రిపై ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఉత్సవాల్లో 21వ రోజు పూజలో తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో వెంకన్న దర్శనమిచ్చారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం అనంతరం, అష్టోత్తర పూజ జరిపి, మంగళహారతి ఇచ్చారు. గోపూజ, గోదాదేవి సన్నిధిలో వ్రతం నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా సుదర్శనహోమం చేశారు. ఘనంగా పూర్ణాహుతి జరిపారు.

ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో దాదాపు 1500 మంది మహిళలతో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. గోపూజ భక్తిశ్రద్ధలతో జరిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి తీసుకువచ్చిన వివిధ రకాల పూలతో స్వామిని అభిషేకించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. వేల మంది భక్తులు వెంకన్న ప్రసాదం స్వీకరించారు. గోవింద నామ స్మరణతో వేంకటాద్రి మార్మోగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు, నగరం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు, పలువురు ప్రముఖులు స్వామివారిని, గోదాదేవిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు శ్రీవారి సేవకులు ప్రసాద వితరణ చేపట్టారు.

ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం వేంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. శ్రీవారి సేవకులు ఆద్యంతం విశేష సేవలందించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, పలువురు నాయకులు, అధికారులు, వేలాదిగా భక్తులు తరలివచ్చి క్రతువులో పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి అక్షర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అక్షర పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బోకం అప్పారావు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ బోకం రామునాయుడు ప్రారంభించారు. 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. వీరిలో 17 మందిని శస్త్ర చికిత్సల కోసం శంకర్ ఫౌండేషన్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు, శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు, అక్షర స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో వెలమ మహానాడు


- వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్
- సుజాతనగర్ రంగరాయ వెలమ సంఘం ఏర్పాటు



లోగో ఆవిష్కరిస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్

సింహాచలం: జీవీఎంసీలోని 98 వార్డుల్లోనూ వెలమ సామాజిక వర్గానికి చెందిన వారందరితో త్వరలో వెలమ మహానాడు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ తెలిపారు. పెందుర్తి దరి సుజాతగనర్ నుంచి అడవివరంలోని పాతగోశాల వరకు ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందినవారితో కొత్తగా సుజాతనగర్‌లో రంగరాయ వెలమ అసోసియేషన్ ఏర్పాటైంది. స్థానిక వెలమ సామాజిక వర్గ ప్రతినిధి వనం ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో పద్మావతినగర్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం సంఘం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ వెలమలంతా ఐక్యంగా ఉండి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అభిలషించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లగుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా తైనాల మహేష్, ఉపాధ్యక్షుడిగా రంభ ఆనందరావు, సహాయ కార్యదర్శిగా రావాడ శ్రీనివాసరావు, కోశాధికారిగా పోతల వెంకటరమణ, సభ్యులుగా రొంగలి సత్యం, లాలం మంగరాజు, గండి భానుప్రకాష్, బండారు నరేష్‌కుమార్, ఆర్.ఆదిత్యనాయుడు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం విశాఖ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్కా చినబాబు, మాజీ అధ్యక్షుడు పైలా సన్నిబాబు, ఉత్తరాంధ్ర వెలమ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరవ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తొలి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 టెన్త్ పూర్వ విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. 34 ఏళ్ల తర్వాత వారు తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి చిలి చేష్టల్ని గుర్తుకు తెచ్చుకుని ఒకరినొకరు ఆటపట్టించుకుని, ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఐదుగురు గురువులను ఆహ్వానించి, పాదపూజ చేసి, ఘనంగా సన్మానించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు జంగయ్య, సింహప్రసాద్, చినసూర్యనారాయణ, సరస్వతిలు విద్యార్థులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు ఆనందంగా గడిపి, ఆ మధురానుభూతులతో తిరుగుముఖంపట్టారు.